# TGSRTC JOINT ACTION COMMITTEE


E.Venkanna - EU, Chairman, 7382856150
K.Hanumanthu Mudhiraj - TJMU, Co - Chairman, 9441428189
M.Thomas Reddy - TMU, Vice Chairman, 9959224180

Md.Moulana - NMU, Convenor, 9030547860
K.Yadaiah - BKU, Co-Convenor, 7382805009
S.Suresh - BWU, Co-Convenor, 9948688425
B.Yadagiri - KP, Co-Convenor, 9959226260


తేది – 07-04-2025

## పత్రికా ప్రకటన

## ఆర్టీసిలో మే 7 నుండి సమ్మె సమర భేరి

తెలంగాణ ఆర్టీసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 27-01-2025న సమ్మె నోటీసు ఇచ్చినా యాజమాన్యం, ప్రభుత్వం, లేబర్ కమిషనర్ నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో 07-04-2025న "ఛలో లేబర్ కమిషనర్ ఆఫీస్" చేపట్టాలని నిర్ణయించినట్లు ఆర్టీసి జెఏసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, కో-ఛైర్మన్ కె.హన్మంత్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తెలిపారు. లేబర్ కమిషనర్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశాన్ని ఉద్దేశిస్తూ జెఏసి నాయకులు ప్రసంగించారు. ఆర్టీసిలో మే 7వ తేదీ నుండి సమ్మె మొదలవుతుందని తెలిపారు.

సమ్మె నోటీసులో 21 అంశాలు ప్రస్తావించామని, ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ, యాజమాన్యాలను ఎన్నో విధాలుగా ఒత్తిడి చేసినా వారినుండి స్పందన రాకపోవడంతో సమ్మె అనివార్యమైందని వారు తెలియజేశారు. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటివరకు ఆ సమస్య ఓ కొలిక్కి రాలేదన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినా నేటివరకు సమస్యను పరిష్కరించలేకపోయారని విమర్శించారు. యూనియన్లను పునరుద్ధరించడం వలన ప్రభుత్వానికి కాని, యాజమాన్యానికి కాని ఆర్థిక పరమైన ఇబ్బంది ఏమీ లేకపోయినా పరిష్కరించకపోవటానికి కారణం ఏమిటో వారికే తెలియాలి అన్నారు. ట్రేడ్ యూనియన్ల రిప్రజెంటేషన్ లేకపోవడం వల్ల కార్మికులు యాజమాన్యపు ఒత్తిళ్ళకు, వేధింపులకు గురవుతున్నారని వారు ఆవేదన చెందారు.

2017 వేతన సవరణ జరిగినా, నేటికీ ఎరియర్స్ రాకపోవటం విచారకరమన్నారు. రిటైరైన ఉద్యోగులకు 2017 వేతన సవరణ ఫిక్సేషన్లు జరపకపోవటం చాలా బాధాకరమని, ఆ ఫిక్సేషన్లు జరిపి వారికి వెంటనే ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2017 అలవెన్స్ లు అమలు జరపలేదని, పాత అలవెన్స్ లనే నేటికీ అమలు చేస్తూ కార్మికుల శ్రమశక్తిని యాజమాన్యం దోచుకుంటోందని వారు విమర్శించారు. 2021 వేతన సవరణ కాల పరిమితి అయిపోయినందున వెంటనే వేతన సవరణ జరిపి కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్ లో ఇచ్చే ఉద్యోగాలు కన్సాలిడేటెట్ పే విధానంలో కాకుండా రెగ్యులర్ బేసిస్ లో ఇవ్వాలని కోరారు. ఎంటిడబ్ల్యు యాక్టును ఉల్లంఘిస్తూ 8 గంటల పనివిధానాలను 12 నుండి 16 గంటల వరకు చేయిస్తూ ఉద్యోగులను యాజమాన్యం ఇబ్బంది పెదుతోందని వారు మండిపడ్డారు. ఎంటిడబ్ల్యు యాక్టును అమలు చేస్తూ 8 గంటల పనివిధానాన్నే కొనసాగించాలని కోరారు. పనిభారాలు ఎక్కువవుతుండడం వల్ల డ్రైవర్లు విధి నిర్వహణలో స్టీరింగ్ పైనే అకాల మరణం పొందుతున్నారని వారు ఆవేదన చెందారు. కండక్టర్లు కూడా దీర్ఘకాలిక వ్యాధులకు గురై విధులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

ఒక డ్రైవర్ 500 నుండి 600 కిలోమీటర్లు బస్సును నడపడం సాధ్యం కాదని, సింగిల్ క్రూ డ్యూటీల కిలోమీటర్లను చట్టప్రకారం నిర్ణయించాలని వారు కోరారు. డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ పేరుతో సస్పెన్షన్లు, రిమూవల్ ఫ్రం సర్వీసు చర్యలను ఆపాలని అన్నారు. బ్రీత్ ఎనలైజర్ మెషీన్లలో సాంకేతిక లోపాలున్నాయని, వాటిని సవరించకుండా డ్రైవర్లను తాగుబోతులుగా చిత్రించడం దుర్మార్గం అన్నారు. డ్రైవర్, కండక్టర్లను చిన్న చిన్న తప్పిదాలపై సస్పెన్షన్లు చేయడం సమంజసం కాదన్నారు. మహాలక్ష్మి పథకంలో ప్రయాణీకుడి కంప్లైంట్ మేరకు కండక్టర్ తప్పిదం లేకపోయినా సస్పెన్షన్ చేసిన దాఖలాలు అనేకం ఉన్నాయని వారన్నారు. బస్సులో ప్రయాణీకులు డ్రైవర్, కండక్టర్లపై దాడులు చేస్తున్నారని, ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు వారికి ప్రాణభయం కూడా ఏర్పడిందన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసికి సరఫరా చేయాలని వారు కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను మాన్యుఫాక్చరర్ నుండి హైర్ బేసిస్ లో తీసుకోవటం వల్ల సంస్థ ఉనికి ప్రమాదంలో పడుతుందని వారు హెచ్చరించారు. రిక్రూట్ మెంట్ లేకపోవటం వల్ల ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని, రిటైరైన ఉద్యోగుల పనిభారాన్ని కూడా సర్వీసులో ఉన్న ఉద్యోగులు మోయలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రొడక్షన్ యూనిట్లలో సిబ్బందిని పెంచాలని, బస్సులను కూడా బయటి సంస్థల నుండి కొనే బదులు ఆర్టీసి బాడీ బిల్డింగ్ యూనిట్స్ లో బస్సుల నిర్మాణం చేసుకోవడం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. సిసిఎస్, పిఎఫ్ లకు ఇవ్వాల్సిన నిధులను యాజమాన్యం వెంటనే చెల్లించాలని కోరారు.

లేబర్ కమిషనర్ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోకపోవటం వల్ల ఆర్టీసి కార్మికవర్గం సమ్మెలోకి వెళుతోందని, దీనికి పూర్తి బాధ్యత, ప్రభుత్వ యాజమాన్యాలే వహించాలని అన్నారు. సమ్మె సమస్యలను పరిష్కరించి ఆర్టీసిలో పారిశ్రామిక శాంతి నెలకొనే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

తేది 07-04-2025న లేబర్ కమిషనర్ ఆఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేయదానికి జెఎసి పిలుపునివ్వగా ప్రభుత్వ, యాజమాన్యాలు కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ నిరసన కార్యక్రమములో పాల్గొనకుండా అడ్డుకట్ట వేయుటకై ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, చెంగిచెర్ల, హకీంపేట, కూకట్ పల్లి, ఇబ్రహీంపట్నం ఇంకా అనేక చోట్ల అక్రమ అరెస్ట్ లను చేయడాన్ని జెఎసి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ అక్రమ అరెస్ట్ లు, కార్మికులపై అణచివేతలు ఇలాగే కొనసాగితే మెరుపుసమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసి కార్మిక వర్గాన్ని అణచివేతలతో, అరెస్ట్ లతో ఉద్యమాలకు దూరంగా ఉంచాలనే ఆలోచన ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, గత ప్రభుత్వం ఆర్టీసి కార్మికులను ఘోష పెడితే వారికి ఏ గతి పట్టిందో ఈ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.

ఈ “ఛలో లేబర్ కమిషనర్” కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా భారీగా కార్మికులు తరలివచ్చి సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధమంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్ రావు, బి.జ్యోతి, ఎం.ఎ.మజీద్, టిఎంయు నాయకులు వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.బి.రెడ్డి, ప్రెసిడెంట్ ఎ.ఆర్.రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్, జి.బి.ఆర్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ శ్రీనివాస్, టిజెఎంయు అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రేమ్ నాథ్, ఎన్.ఎం.యు నాయకులు గ్రేటర్ హైదరాబాద్ జోనల్ సెక్రటరీ వల్లూరి బాబు, రాష్ట్ర సెక్రటరీ కె.ఎస్.పాల్, కార్మిక పరిషత్ ప్రెసిడెంట్ ఎం.కె.బోస్, బికెయు ప్రెసిడెంట్ మునిరాములు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాములు, బిడబ్ల్యుయు ప్రెసిడెంట్ జె.సత్యనారాయణ గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.బయ్యన్న, స్టేట్ ట్రెజరర్ బి.శ్రీనివాస్ గౌడ్, నాయకులు డి.రామ్ చందర్ లతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

K. Sai Nath

ప్రజా సంబంధాల కార్యదర్శి